www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 27 ఏప్రిల్ 2025

5

పశ్చిమ గోదావరి

ఆక్రమణల తొలగింపునకు రంగం సిద్ధం

గణపవరం : మండలకేంద్రమైన గణపవరంలో రోడ్డుకిరువైపులా ఆక్రమణల తొలగింపునకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఆక్రమణల తొలగింపుపై స్థానిక వ్యాపారులతో ఎంపిడిఓ కార్యాలయంలో మండల తహశీల్దార్ అప్పారావు, ఎంపిడిఓ ఆర్.బేబిశ్రీలక్ష్మి సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో వ్యాపారుల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. అయితే గణపవరం, సరిపల్లి గ్రామంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న డ్రైయినేజీల అవతలకు షాపులు ఉండేవిధంగా చూసుకోవాలని తహశీల్దార్ అప్పారావు సూచించారు. ఈరెండు గ్రామాల్లో డ్రైయినేజీలు పైనే షాపులు ఉండటం వల్ల ఆక్రమణల తొలగింపులో నష్టపోయే పరిస్థితి కలుగుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణల తొలగింపు జనవరిలో జరగవలసి ఉందని, అయితే రోడ్డు భవనాల శాఖ, పంచాయతీ, రెవెన్యూ అధికారులకు సమన్వయం కుదరకపోవటంతో వాయిదాలు వేసుకొచ్చారు. మరలా అధికారులు ఆక్రమణల తొలగింపుపై దృష్టిపెట్టడంతో వ్యాపారస్తులు ఆందోళన చెందుతున్నారు.

కొల్లేరు కాంటూరు లెక్కలన్నీ అస్తవ్యస్థమే

మూడో కాంటూరుకు కుదిస్తేనే న్యాయం
ఉపాధి, అభివృద్ధి లేక నరకయాతన అనుభవిస్తున్నాం
కాంటూరులో లేని భూములను సైతం ధ్వంసం చేసి రోడ్డున పడేశారు
అండగా ఉండాలంటూ సిపిఎం బృందానికి కొల్లేరు ప్రజల వినతి
ఎప్పటికీ కొల్లేరు ప్రజల వైపే నిబడతామని సిపిఎం నేతల భరోసా



గుడివాకలంకలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి, మండవల్లి, ఏలూరు సిటీ

కొల్లేరు కాంటూరు లెక్కలన్నీ అస్తవ్యస్థంగా నిర్ణయించారని, అధికారులు చేసిన తప్పిదాలకు తాము బలిపశువులుగా మారామని, ఉపాధి, అభివృద్ధి లేక నరకయాతన అనుభవిస్తున్నామని కొల్లేరు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నేత మంతెన సీతారాం, జిల్లా నేతల ఆధ్వర్యంలో సిపిఎం బృందం శనివారం కొల్లేరు ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా గుడివాకలంక, కొవ్వాడలంక గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లోనూ, పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు ప్రజలు, నాయకులు తమ సమస్యలను సిపిఎం బృందానికి వివరించారు. తొలుత ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకలంక గ్రామానికి సిపిఎం బృందం చేరుకోగానే పంచాయతీ సర్పంచి ఘంటసాల నాగరాజు, కొల్లేరు పెద్దలు స్వాగతం పలికారు. అనంతరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సర్పంచి నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముందుగా జిల్లా కార్యదర్శి ఎ.రవి సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులను గ్రామస్తులకు పరిచయం చేశారు. సర్పంచి నాగరాజు, గ్రామస్తులు తాతిపూడి చందు, దొరబాబు మాట్లాడుతూ తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తేనే ఇక్కడి ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. జనసేన దెందులూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఘంటసాల వెంకటలక్ష్మి కొల్లేరు ప్రజల సమస్యలను సిపిఎం నాయకులకు వివరించారు. కొల్లేరు ప్రజలకు అండగా ఉండాలని కోరారు. కొల్లేరు ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, నేతలు రావడం ఎంతో ధైర్యంగా ఉందన్నారు. అనంతరం సిపిఎం బృందం, గ్రామస్తులతో కలిసి గుడివాకలంక గ్రామంలో నిర్మించిన రిసార్ట్‌ను పరిశీలించింది. అక్కడి నుంచి మాధవాపురంలో ఏర్పాటు చేసిన పక్షుల కేంద్రం వద్దకు వెళ్లి కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం పెదఎడ్లగాడి వంతెన వద్ద ఆగి కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న కలకుర్రుకు చెందిన కొల్లేరు నాయకులు ఘంటసాల పెద్దిరాజు, ప్రత్తికోళ్లలంకకు చెందిన మహాలక్ష్మిరాజు సిపిఎం నాయకులను కలిసి కొల్లేరు గ్రామాల్లో పరిస్థితిని మ్యాప్‌లు, కొల్లేరు గ్రామాల్లో కాంటూరుతో సంబంధం లేకుండా ఎక్కడెక్కడ భూములను ధ్వంసం చేశారో వివరించారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ కొల్లేరు కాంటూరు లెక్కలన్నీ అస్తవ్యస్థంగా ఉన్నాయన్నారు. కాంటూరులో లేని భూములను సైతం ధ్వంసం చేసి ఇక్కడి ప్రజలను రోడ్డున పడేశారన్నారు. సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసి వాస్తవాలను వెల్లడించాలన్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కొల్లేరు ప్రజలకు అండగా ఉంటామన్నారు. అనంతరం మండవల్లి మండలంలోని కొవ్వాడలంక గ్రామంలో సిపిఎం బృందం పర్యటించింది. గ్రామ సర్పంచి జయమంగళ తిరుపతి వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు వి.శ్రీనివాసరావు, బి.బలరాం మాట్లాడుతూ 2006, అంతకు ముందు కొల్లేరు ప్రజలకు అండగా సిపిఎం పోరాటం సాగించిందని గుర్తు చేశారు. రానున్న రోజుల్లోనూ కొల్లేరు ప్రజలకు సిపిఎం అండగా ఉంటుందని, సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కలిసికట్టుగా పోరాటం చేద్దామన్నారు. సిపిఎం బృందంలో నాయకులు ఆర్.లింగరాజు, డిఎన్‌విడి.ప్రసాద్, కె.శ్రీనివాస్, పిల్లి రామకృష్ణ, లెనిన్, ఇస్సాక్, కట్టా భాస్కరరావు, మానుకొండ వీర్రాజు, ఇతర నాయకులు ఉన్నారు.

కొల్లేరును పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర, జిల్లా నేతలు

మూడు లక్షల మందిని మనుషులుగా గుర్తించండి

ఘంటశాల వెంకటలక్ష్మి, జనసేన దెందులూరు నియోజకవర్గ నేత

కొల్లేరు గ్రామాల్లో మూడు లక్షల మంది ప్రజలు ఉన్నారు. మమ్మల్ని మనుషులుగా గుర్తించాలని కోరుతున్నాం. పర్యావరణం, పక్షులతోపాటు మమ్మల్నీ గుర్తించాలి. సిపిఎం బృందం వద్దకు వెళ్లాలని తామే అనుకుంటుంటే, వారే ఇక్కడకు రావడం చాలా ధైర్యాన్ని ఇచ్చింది. ఇక్కడి సమస్యలను సుప్రీంకోర్టు కమిటీకి మీరే తెలపాలి. మా బాధలు తెలుసుకుని అండగా ఉండాలని సిపిఎం నేతలను కోరుతున్నాం.

కొల్లేరు ప్రజల జీవితాల్ని నాశనం చేశారు

చందు, గుడివాకలంక గ్రామస్తుడు

2006లో చెరువులన్నీ కొట్టేశారు. మెరుగైన జీవనోపాధి ఇస్తామని చెప్పి ఉన్న జీవితాలను నాశనం చేశారు. ఇక్కడి ప్రజలకు చేపల వేటనే ఉపాధి. కొల్లేరు ప్రజలు డబ్బుతో ఉన్నారంటూ అనుకుంటారు. ఇక్కడికి వచ్చి చూస్తే మా పరిస్థితి తెలుస్తుంది. రోడ్లు సైతం వేయకుండా వదిలేశారు. పర్యావరణంతోపాటు కొల్లేరు ప్రజల జీవితాలను కాపాడాలని కోరుతున్నాం. సిపిఎం లాగేనే అందరూ కొల్లేరు ప్రజలకు అండగా ఉండాలనేది మా ఆకాంక్ష.

అధికారుల తప్పిదాలకు మేం బలి పశువులుగా మారాం

ఘంటశాల మహాలక్ష్మిరాజు, కొల్లేరు నాయకుడు

అధికారులు కొల్లేరు కాంటూరు లెక్కలన్నీ అస్తవ్యస్థంగా తయారు చేయడంతో మేం బలి పశువులుగా మారాం. కైకలూరు, మండవల్లి గ్రామాల్లో 7,600 ఎకరాల జిరాయతీ భూములను ధ్వంసం చేశారు. 120 జిఒకు సంబంధం లేకుండా ఇది జరిగింది. కొవ్వాడంలంక గ్రామం పూర్తిగా దెబ్బతింది. మ్యాప్‌లు, నివేదికలకు సంబంధం లేకుండా కాంటూరు లెక్కలను నిర్ధేశించి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారు. సమస్య లను ఢిల్లీ వరకూ తీసుకెళ్లి కొల్లేరు ప్రజలకు సిపిఎం అండగా ఉండాలని కోరుతున్నాం.

మా పిల్లల భవిష్యత్తును కాపాడండి

దొరబాబు, గుడివాకలంక గ్రామస్తుడు

కొల్లేరు ప్రజలు ఇప్పటికే కూలికి వెళ్తేనే రోజు గడిచే పరిస్థితి ఉంది. మా బతుకులు బుగ్గిపాలయ్యాయి. మా పిల్లల భవిష్యత్తునైనా కాపాడాలి. సిపిఎం నాయకులు వచ్చి భరోసా ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది.

మూడో కాంటూరుకు కుదించాలన్నా పట్టించుకోవడం లేదు

ఘంటశాల నాగరాజు, సర్పంచి, గుడివాకలంక

ఎన్ని ప్రభుత్వాలు మారినా కొల్లేరును మూడో కాంటూరుకు కుదించడంపై పట్టించుకోవడం లేదు. పర్యావరణానికి మేము ఆటంకం కాదు.. మాకు శాశ్వత పరిష్కారం చూపాలి. 2006లోనూ సిపిఎం కొల్లేరు ప్రజలకు అండగా నిలిచింది. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాం.

గ్రామంలో సెంటుభూమి లేకుండా చేశారు

జయమంగళ తిరుపతి వెంకన్న, సర్పంచి, కొవ్వాడలంక

ఐదో కాంటూరు పైన ఉన్న భూములను కొట్టేశారు. గ్రామంలో సెంటుభూమి లేకుండాపోయింది. కూలినాలికి వెళ్లి బతుకుతున్నాం. గ్రామంలో ఏ ఆధారమూ లేకుండాపోయింది. మాకు న్యాయం చేయాలని కోరుతున్నాం.

అవాస్తవాలు చెప్పే వారంతా బాధ్యత వహించాలి

పేదల ఇళ్ల తొలగింపులో అధికారుల తీరు దుర్మార్గం : బాధిత ప్రజలకు అండగా నిలుస్తాం
ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవరావు
పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో పర్యటించిన హైకోర్టు లాయర్ల బృందం

న్యాయవాదులకు సమస్యలు వివరిస్తున్న మహిళలు

ప్రజాశక్తి – భీమవరం

పేదల ఇళ్ల తొలగింపులో అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పేవన్నీ అవాస్తవాలేనని, రాబోయే రోజుల్లో వారంతా బాధ్యత వహించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవరావు అన్నారు. పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో ఐలు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు లాయర్ల బృందం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా బాధితులు తమకు జరిగిన అన్యాయం, నష్టాన్ని వివరించి కంటతడి పెట్టుకున్నారు. దీనిపై ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవరావు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో సుమారు 700 ఇళ్లు కూల్చారన్నారు. ఈ ప్రాంతంలోని కాల్వలోకి మురుగు నీరు వెళ్తుందని అధికారులు, ప్రభుత్వం చెబుతున్న దంతా అవాస్తవమన్నారు. ఇదే ప్రాంతానికి 20 ఏళ్ల క్రితం టిడిపి ఎంఎల్ఎ సీసీ రోడ్డు నిర్మించారన్నారు. ఆ రోడ్డును దాటే మురుగునీరు కాల్వలోకి రావాలని, అయితే ఆ నీరు రాకుండా ప్రతి ఇంటికి సెప్టిక్ ట్యాంకు ఉందని అన్నారు. నిజంగా నీరు కలుషితమైతే ఆ నీటిని పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపాలని సూచించారు. బాధితుల ఇళ్ల వెనుక భాగాన ఉన్న భూస్వాములు ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటే అవి అధికారులకు కన్పించడం లేదా అని ప్రశ్నించారు. బాధితులకు చట్టప్రకారం అనేక హక్కులు ఉన్నాయని, వాటిని సాధించుకునే విధంగా బాధితుల పక్షాన నిలుస్తామని అన్నారు. బాధితులపై దుర్మార్గం చేసిన వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామన్నారు. బాధితులందరూ ఐక్యంగా పోరాడితే చట్టపరంగా వారికి అవసరమైన న్యాయ సహాయాన్ని అంతటినీ తాము అందిస్తామన్నారు.

పేదలపై దౌర్జన్యం చేసిన అధికారులను వదలం
ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్

పేదలపై దౌర్జన్యం చేసిన అధికారులను వదిలిపెట్టేది లేదు. ప్రభుత్వ భూముల్లో పేదలు ఇళ్లు వేసుకుంటే పట్టాలు ఇవ్వాలని అనేక ప్రభుత్వాలు చెప్పాయని ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్ అన్నారు. ఇక్కడ నివశిస్తున్న పేదల ఇళ్ల వెనుక ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న భూస్వాములే, వీరి ఇళ్ల ముందు ఉన్న కొబ్బరి చెట్ల ఫలసాయం సైతం పొందడం విడ్డూరంగా ఉందని అన్నారు. చట్టాలను ఉల్లంఘించి పేదలపై దౌర్జన్యం చేసిన అధికారులను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. కోర్టు పరిధిలో ఉన్నంత వరకు ఇక్కడ ఇళ్లను తొలగించే ప్రయత్నాలు ఆపాలన్నారు. పేదలకు పట్టాలిచ్చి, ఇళ్ల కట్టించి అప్పుడు ఇక్కడ ఇళ్లను కూల్చితే తాము కూడా సమర్థిస్తామని, అంతేగాని ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్ల ఎలా కూల్చుతారని నిలదీశారు. ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ ఎఎస్ఆర్ నగర్ పక్కనే ఉన్న ఆక్వా చెరువులే కాలుష్యానికి కారణమన్నారు. కోర్టు పరిధిలోని ఇళ్లను కూడా కూల్చివేయడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. పేదలపై దౌర్జన్యం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా సరే కోర్టులో దోషులుగా నిలబడాల్సి వస్తుందన్నారు. ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హైకోర్టు అడ్వకేట్ ఎడపల్లి రమేష్ మాట్లాడుతూ అధికారులు కలుషితమవుతోందని చెబుతున్న పంట కాలువలోని నీటితోనే ఇక్కడి ప్రజలు 30 ఏళ్లుగా అన్నం వండుకుంటున్నారని తెలిపారు. తక్షణం తొలగించిన చోటే ఇళ్ల నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో హైకోర్టు లాయర్లు సంపర శ్రీనివాసరావు, మద్దాల సాయితేజ, ఎన్.కోటబాబు, పివిపి.లక్ష్మి పాల్గొన్నారు.

పేదలకు, బాధిత ప్రజలకు నిరంతరం అండదండగా ఉంటామంటూ పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో పేదలతో కలిసి శనివారం రాత్రి నిద్రించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, నేత జక్కంశెట్టి సత్యనారాయణ ఇతరులు

పేదలకు అండదండగా..

ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలపై

కొనసాగిన నిరసనలు

ప్రజాశక్తి – భీమవరం

భీమవరంలో...

ప్రజా ఉద్యమాల సారథి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావుకు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు క్షమాపణ చెప్పి నోటిని శుద్ధి చేసుకోవాలని సిపిఎం శ్రేణులు సూచించాయి. పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్ ఇళ్ల కూల్చివేత బాధితులకు అండగా నిలిచి, వారికి న్యాయం చేయాలని కోరిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై, నేతలపై డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ భీమవరంలో శనివారం సిపిఎం శ్రేణులు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు మాట్లాడారు. అబద్ధాలు, అనుచిత వ్యాఖ్యల ద్వారా

తాడేపల్లిగూడెంలో...

సమస్యలు పరిష్కారం కావని, చిత్తశుద్ధి ఉంటే సక్రమంగా సమాధానం చెప్పాలన్నారు. ఆయన బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.వైకుంఠరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డి.త్రిమూర్తులు, ఎం.ఆంజనేయులు, డి.నాగు, పులి అప్పన్న పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై దూషణపర్వానికి దిగిన ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుపై వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సుందరయ్య భవనం నుండి పోలీస్ ఐల్యాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. రఘురామ కృష్ణరాజు అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడగా గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నరమాల కృష్ణ, కె.కొండలరావు, వి.శ్రీను, తోట శ్రీను, కలిగట్ల వీర్రాజు, తంగేటి శ్రీను, పతివాడ నాగేంద్రబాబు, యడవల్లి వెంకట దుర్గారావు, పప్పల ప్రభాకరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు: సిపిఎం ఆధ్వర్యాన స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. నాయకులు వీర పాండురంగారావు, కొత్తపల్లి నాగరాజు, చిలకలపూడి నాగేశ్వరరావు, అడ్డాల ఏడుకొండలు పాల్గొన్నారు.

నరసాపురం: స్థానిక అంబేద్కర్ సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ రఘురామకృష్ణరాజు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు పొగాకు నారాయణరావు, నోముల కొండ, బూడిద జోగేశ్వరరావు, కోడి లక్ష్మణ్, కోరాడ బద్రి, పొన్నాడ మల్లేష్, నరేష్ పాల్గొన్నారు.

పెంటపాడు: స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కన్వీనర్ సిరపరపు రంగారావు, నేతలు చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో పెనగంటి

నరసాపురంలో...

దుర్గా, పైలి ప్రసాద్, పాలపర్తి కృష్ణ, పూడి బాలాజీ, వెన్నెల రామకృష్ణ, దత్తు రాము, సంకు వీరాస్వామి, మీసాల శ్రీను, చల్లా గోవిందరాజు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి – నరసాపురం

గత ప్రభుత్వ హయాంలో నరసాపురం నియోజకవర్గం 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద మత్స్యకార భరోసా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్ర విభజన తర్వాత శంకుస్థాపన చేసిన నల్లిక్రిక్, హార్బర్ పనుల్ని ప్రభుత్వం ఉద్ధేశపూర్వకంగానే ఆపిందన్నారు. అయితే తాను ఇప్పుడు మంత్రి అచ్చం నాయుడుతో హార్బర్ పెండింగ్ పనులపై ఫోన్లో మాట్లాడానన్నారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలో పనులు చేపడతామని హామీ ఇచ్చినట్లు రామానాయుడు చెప్పారు. నల్లిక్రిక్ పనుల్ని గతంలో చేపట్టిన కాంట్రాక్టర్‌తో చర్చించి పాత రేట్లకే పనులు జరిగే విధంగా చర్చిస్తామన్నారు. ఫైనాన్స్ శాఖ క్లియరెన్స్ రాగానే పెండింగ్ పడిన డెల్టా మోడ్రనైజేషన్ పనుల్ని తిరిగి ప్రారంభిస్తామని రామానాయుడు హామీ ఇచ్చారు. అనంతరం జిల్లాలో 1,785 మందికి రూ.3.57 కోట్ల చెక్కులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టిడిపి స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కొప్పల రామ్మోహన్ నాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు.



మత్స్యకారులకు చెక్కులందజేస్తున్న మంత్రి నిమ్మల, విప్ నాయకర్

అభివృద్ధి అంటే..!

ఎన్నికల ముందు ప్రచారంలో ప్రతిపక్ష, అధికారపక్షాలు ఈ పదాన్ని ఎక్కువ ఉపయోగిస్తుంటాయి. ఎన్నికల తర్వాత ఆ స్థాయిలో కాకపోయినా నేతల నోట పదేపదే విన్పించే మాట ఇదే. అయితే తాము చేసిన పనులే అభివృద్ధి పనులుగా పాలకులు చెప్పుకుంటే.. ప్రజల సమస్యలను ప్రస్తావించి వాటి సంగతేమిటని నిలదీయడం ప్రతిపక్షాల వంతు. 'పది మంది దోషులు బయటున్నా పర్వాలేదుగాని.. ఒక నిర్దోషి నిర్బంధంలో ఉండకూడదు' అనేది సహజ న్యాయ సూత్రం. అలాగే అభివృద్ధి అనేది ఏఒక్క పేదవానికీ నష్టం కల్గించకుండా ఉండాలనేది జనం, జనం పక్షాన నిలిచేవారి ఆకాంక్ష.

ప్రస్తుతం పశ్చిమగోదావరి జిల్లాలో అభివృద్ధి అనే అంశంపై పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఇది ఉండి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉందనేది అందరికీ తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కాల్వల అభివృద్ధికి విరాళాల సేకరణ చేపట్టిన ఘనత ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజుకే దక్కింది. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున ప్రభుత్వం చేపట్టాల్సిన పనులు ఎంఎల్ఎ తన భుజస్కంధాలపై వేసుకుని విరాళాలు సేకరించి పనులు చేపడుతున్నారని అంతా భావించారు. తర్వాత నియోజకవర్గ పరిధిలోని పోలీసు స్టేషన్లు అన్నింటికీ వాహనాలు సమకూర్చడం, సీసీ కెమెరాలు సమకూర్చడం వంటివన్నీ దాతల ద్వారా ఎంఎల్ఎ చేపట్టారు. వీటిలో ఎక్కడా పేద, మధ్యతరగతి ప్రజలకు దాతల నుంచి సేకరించిన సాయం అందించింది లేదు. అంటే చంద్రబాబు చెబుతున్న పి4 ప్రకారం పెద్దల ద్వారా పేదల అభివృద్ధి పక్కనబెట్టి, పెద్దల నుంచి ప్రభుత్వ శాఖలకు కనీస వసతుల కల్పనపైనే సాగడం అనేది ఉండి నియోజకవర్గ పి4 ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఇక ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని నివశిస్తున్న పేదల ఇళ్లను కాలుష్య నివారణ, కాల్వల అభివృద్ధి పేరిట వందల సంఖ్యలో ఉండి నియోజకవర్గంలో తొలగించారు. ఆకివీడు, కాళ్ల, ఉండి, పాలకోడేరు ఇలా అన్ని మండలాల్లోనూ ఇది సాగింది. దీనిపై ఆయా సందర్భాల్లో పెద్దఎత్తున పేదలు ఆందోళన చేశారు. దీనిలో భాగంగానే పాలకోడేరు ఎఎస్ఆర్ నగర్‌లో సుమారు 35 ఏళ్ల నుంచి నివాసముంటున్న వారిని గత శనివారం ఖాళీ చేయించే ప్రయత్నం చేయగా పేదలు పెద్దఎత్తున ప్రతిఘటించారు. ఈ క్రమంలో పోలీసుల దాడిలో పలువురు గాయాల పాలయ్యారు. దీంతో వెనక్కితగ్గిన యంత్రాంగం, మరుసటి రోజు తెల్లవారుజామునే ముందుగానే నేతలను గృహనిర్బంధం చేసి ఆ ప్రాంతంలో పెద్దసంఖ్యలో పోలీసులను మొహరించి నిర్దాక్షిణ్యంగా ఇళ్లను కూల్చేశారు. దీనిపై బాధితులను పరామర్శించి, ధైర్యం చెప్పేందుకు సిపిఎం రాష్ట్ర బృందం అక్కడ పర్యటించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల ఇళ్లు కూల్చడం అభివృద్ధి

కాదని, నెల రోజుల్లో అక్కడే బాధిత పేదలకు ఇళ్ల నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని బహిరంగంగానే ప్రకటించారు. పేదలకు న్యాయం చేయాలనేది ఆయన ప్రధాన డిమాండ్. దీనిపై డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజు స్పందించిన తీరు రాజకీయ నేతలను, ప్రజలను నిర్ఘాంత పర్చింది. ప్రధానంగా వాడిన భాష, తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. పోనీ ఆయన భాష, తీరు సంగతి పక్కన పెడితే సిపిఎం నేతల ప్రధాన డిమాండ్ పేదలకు న్యాయం చేయాలనేది. దానిపై ఎక్కడా నేరుగా ఎంఎల్ఎ స్పందించిన పరిస్థితి లేదు. ప్రధానంగా ఎక్కడైతే ఇళ్ల కూల్చారో వారందరికీ ఇళ్ల అక్కడే నిర్మిస్తామనో, లేక వేరేచోట స్థలాలు కేటాయించి నిర్మిస్తామని చెబితే అర్థం ఉంది. పేదల నివాస ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న బోదె దిగువ ప్రాంతం వారు కాలుష్యం వల్ల ఇబ్బంది పడుతున్నందు వల్లే ఈ చర్యలని రఘురామకృష్ణరాజు చెప్పారు. కచ్చితంగా కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాల్సిందే. అసలు కాలుష్యం సమస్యపై జిల్లాలో పోరు సాగించింది ఎవరంటే సిపిఎం అనేది అందరికీ తెలుసు. గత టిడిపి ప్రభుత్వ హయాంలో అప్పటి కార్మిక శాఖ మంత్రి పితాని సత్యనారాయణ భీమవరంలో సమావేశం నిర్వహించి సుమారు 19 పరిశ్రమల వల్ల డెల్టాలో కాలుష్యం సమస్య తీవ్రంగా ఉందని సైతం ప్రకటించారు. ఇది సిపిఎం పోరుబాట ఫలితమేనని టిడిపి నేతలకు సైతం తెలుసు. ఇక ఎఎస్ఆర్ నగర్‌వాసుల వల్ల కాలుష్యం సమస్య 35 సంవత్సరాలుగా లేనిది ఇప్పుడే వచ్చిందా. ఒకవేళ వస్తే ఈలోపు అక్కడి ప్రజలను హెచ్చరించి, దిగువ ప్రాంత ప్రజలకు ఇబ్బంది రాకుండా తాత్కాలిక ఉపశమన చర్యలు చేపట్టొచ్చు. అక్కడ నివశిస్తున్న అర్హులైన పేదలకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపి ఇళ్ల కట్టి ఇచ్చి వెళ్లమంటే అన్ని విధాలా న్యాయబద్ధంగా ఉండేదనేది అందరి భావన. ఎందుకంటే ఇప్పటికే కోట్లాది రూపాయలు దాతల నుంచి సేకరించి ప్రభుత్వ శాఖలకు వసతులు సమకూర్చుతున్న ఎంఎల్ఎ రఘురామకృష్ణరాజుకు వంద కుటుం

పోలీసు సిబ్బంది పిల్లలకు సత్కారం

విద్యార్థులను సత్కరిస్తున్న పోలీసులు

పెనుమంట్ర : పది ఫలితాల్లో పోలీసు సిబ్బంది పిల్లలు సత్తా చాటారు. పెనుమంట్ర పోలీస్ స్టేషన్ హోంగార్డ్ చెల్లబోయిన ప్రభాకర్ కుమార్తె చెల్లబోయిన ప్రణీత 589 మార్కులు, పెనుగొండ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ చుక్కా నరేంద్ర కుమారుడు చుక్క పవన్ వెంకట మణికిరణ్ 563 మార్కులు సాధించారు. వారిని శనివారం నరసాపురం డిఎస్పి డాక్టర్ జి.శ్రీవేద ఆధ్వర్యంలో పెనుగొండ సిఐ రాయుడు విజయకుమార్, పెనుగొండ ఎస్ఐ కె.గంగాధరరావు, పెనుమంట్ర ఎస్ఐ కె.స్వామి, ఆచంట ఎస్ఐ కెవి.రమణ ఇద్దరు విద్యార్థులను శాలువాలతో సత్కరించి, అభినందించి మెమొంటోలు అందించారు.

కష్టపడి చదివితే అన్ని రంగాల్లోనూ రాణించొచ్చు

జెఇఇ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన ఎంఎల్ఏ

భీమవరం టౌన్ : కష్టపడి, ఇష్టపడి చదివితే అన్ని రంగాల్లోనూ ప్రతిభ కనబరచవచ్చునని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎంఎల్ఏ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. జెఇఇ మెయిన్స్-25 ఆలిండియా స్థాయిలో ప్రతిభ చాటిన భీమవరం తిరుమల విద్యాసంస్థల విద్యార్థులను ఎంఎల్ఏ అంజిబాబు శనివారం వారి క్యాంప్ కార్యాలయంలో అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలిండియాలో 1000 లోపు ర్యాంకులు 7 గురు విద్యార్థులు, 2 వేల లోపు ర్యాంకులు 12 మంది, 5 వేల లోపు 20 మంది, 10 వేలు 46 మంది, 15 వేల లోపు 71 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించడం మన జిల్లాకే గర్వకారణమని అన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.సాయిరాజు మాట్లాడుతూ జెఇఇ మెయిన్స్‌లో తమ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని, 160 మంది విద్యార్థులు 35 వేల లోపు ర్యాంకులు సాధించారని, డి.సుశాంత్ 276 ర్యాంక్, పిఎస్.వర్మ 337 ర్యాంకు సాధించారని తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంఎల్ఏ అంజిబాబు అభినందించారు. ఎఒ రంగ (శ్రీనివాస్, చెరుకువాడ రంగసాయి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, చింతలపాటి బంగారాజు, సూరిశెట్టి కల్పన పాల్గొన్నారు.

రైతాంగ సేవలోనే ఉన్నాం : మంత్రి

పాలకొల్లు రూరల్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతాంగ సేవల్లోనే పనిచేస్తుందని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. శనివారం మన రైతు మన రామానాయుడు కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు రూరల్‌లోని మూడు గ్రామాల్లో రూ.కోటితో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. పాలకొల్లు రూరల్ పెదగరువు గ్రామంలో రూ.17.69 లక్షలతో ఆవ డ్రెయిన్ బ్రిడ్జి దగ్గర ఆవ మీడియం డ్రెయిన్‌పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కొత్తపేట గ్రామంలో రూ.37 లక్షలతో దిగమర్రు చానెల్‌పై రహదారి గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, పెదమామిడిపల్లి గ్రామంలో రూ.11 లక్షలతో దిగమర్రు చానెల్‌పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, మరో రూ.17.69 లక్షలతో హెచరి దగ్గరలో రాయలకోడు మైనర్ డ్రెయిన్‌పై గ్రావెల్ రహదారి నిర్మాణ పనులకు, రూ.16 లక్షలతో హెచరి దగ్గరలో రాయలకోడు మైనర్ తవ్వకం పనుల ప్రారంభానికి పూజలు జరిపి పనులు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు, పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు స్వాగతం పలికారు. ఆయన మోటార్ సైకిల్‌పై పర్యటిస్తూ ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, సర్పంచి కౌరు భారతి, సర్పంచి రాపాక కరుణాకర్, కూటమి నాయకులు కోడి విజయభాస్కర్, పాముల రజినీకుమార్, పెచ్చెట్టి బాబు, జీవి, బోనం నాని, ఉన్నమట్ల కబర్ది, తులా రామలింగేశ్వరరావు, దొడ్డ శ్రీనివాసరావు, తమ్మినీడి చంద్రశేఖర్, కౌరు మురళీకృష్ణ, కౌరు సందీప్ కుమార్, కట్ట మురళీధర్, కేత వీర రాఘవులు, రాపాక దేవిప్రాజు పాల్గొన్నారు.

వైసిపి పబ్లిసిటీ కార్యదర్శిగా సోమరాజు

గణపవరం : వైసిపి రాష్ట్ర పబ్లిసిటీ వింగ్ కార్యదర్శిగా గణపవరం గ్రామానికి చెందిన నడంపల్లి సోమరాజు నియమితులయ్యారు. ఈమేరకు సోమరాజు శనివారం గణపవరంలో ఒకప్రకటన విడుదల చేశారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ అనుబంధాల ఏర్పాటులో భాగంగా తనకు పదవి ఇచ్చినట్లు చెప్పారు. పార్టీ అభివృద్ధికి కృషిచేస్తున్న తనకి పబ్లిసిటీ వింగ్ పదవి ఇచ్చినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌కి, రాష్ట్ర అడ్వైజర్ కమిటీ సభ్యులు పుప్పాల శ్రీనివాస్ రావు(వాసుబాబు)కి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు.

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

పాలకొల్లు : గత 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ వెంటనే విడుదల చేయాలని, ఇపిఎఫ్ పునరుద్ధరించాలని పిహెచ్‌సిలలో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు మంత్రి నిమ్మల రామానాయుడును పాలకొల్లు క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిశారు. నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా ప్రతి సంవత్సరం ఇంక్రిమెంట్ 23 శాతం ఇవ్వాలని, ఇంటి అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని, 6 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన వారి సర్వీస్‌ని క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. వీరు గత వారం రోజులుగా నిరసన తెలుపుతూ ఈరోజు మంత్రిని కలిసారు. మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రభుత్వం వేరు కాదని, ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకొని పని చేయాలని కోరారు. పాలకొల్లు ఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడు గుడాల హరిబాబు, కార్యదర్శి రామరాజు, ఎపిఎంసిఎ జిల్లా అధ్యక్షులు శిరీష రాణి ఉన్నారు.

యర్రాయిచెరువులో ఇరుపక్షాల మధ్య ఘర్షణ, ఉద్రిక్తత

ఉమ్మడి చెరువుగట్టుపై విగ్రహం ఏర్పాటుతో తలెత్తిన వివాదం

కొనసాగుతున్న పోలీస్ పికెట్

తణుకు రూరల్ : తణుకు మండలం యర్రాయిచెరువు గ్రామంలో ఇరుపక్షాల మధ్య శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలో ఒకే సామాజిక తరగతికి చెందిన ఇరువురు బాహాబాహీకు దిగారు. దీంతో తణుకు రూరల్ పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను చెదరగొట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. యర్రాయిచెరువు గ్రామం పరిధిలో తణుకు మండలం వేల్పూరు పాలెంతోపాటు తణుకు మండలం కొమరవరం, యర్రాయిచెరువు పాలేలు ఉన్నాయి. ఈ మూడు పాలేలకు సంబంధించి గ్రామంలో ఉన్న ఉమ్మడి చెరువును ఒకే సామాజిక తరగతికి చెందిన వారు వినియోగించుకుంటున్నారు. అయితే చెరువు మొత్తం వేల్పూరు పాలెం గ్రామస్థులకు చెందినది కావడంతో చెరువు గట్టుపై ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మరోవైపు ఈ పాలేలకు చెందిన గ్రామస్తుల్లో ఎవరు చనిపోయినా తదుపరి కార్యక్రమాలకు ఈ చెరువును వినియోగించుకుంటూ ఉంటారు. అయితే శుక్రవారం అర్ధరాత్రి దేవాలయం నిర్మాణం చేపట్టాలనే ఉద్దేశంతో గ్రావెల్ వేయించారు. దీంతో యర్రాయిచెరువు, కావలిపురం పాలేలకు చెందిన గ్రామస్థులు పెద్ద ఎత్తున సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకు దిగారు. ఇరుపక్షాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులను చెదరగొట్టారు. మరోవైపు శనివారం సైతం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో తణుకు రూరల్ సిఐ కృష్ణకుమార్, ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసి 144 సెక్షన్ విధించినట్లు సిఐ కృష్ణకుమార్ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

తప్పిన పెను ప్రమాదం

మొగల్తూరు : మండలంలోని మోడీ గ్రామంలో రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని పర్యాటకుల కారు శనివారం ఢీకొట్టడంతో అది విరిగి నేలపై పడింది. ఆ సమయంలో అటువైపు ఎవరూ వెళ్లకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఏలూరుకి చెందిన వ్యక్తి పేరుపాలెం బీచ్ నుంచి కారులో వస్తూండగా మోడీ గ్రామానికి వచ్చేసరికి అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ప్రమాదం జరిగిన సమయంలో ఒకే వ్యక్తి ఉన్నారు. ఆ రహదారిపై ఏ వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అధికారులు విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు.

బంగారు ఆభరణాల చోరీ

తణుకు రూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన తణుకు మండలం వేల్పూరు గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తణుకు మండలం వేల్పూరు గ్రామంలో బాలాజీ నగర్ 11వ రోడ్డులో నివాసం ఉంటున్న చొప్ప కృష్ణకాంత్ వారం రోజుల క్రితం కుటుంబంతో సహా హైదరాబాద్ వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చేసరికి తలుపు పగలగొట్టి, బీరువాలోని వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించారు. బంగారు ఆభరణాలతోపాటు నగదును దుండగులు అపహరించుకుపోయారు. బీరువాలో దాచుకున్న 12 కాసుల బంగారు ఆభరణాలతోపాటు రూ.50 వేల నగదును అపహరించుకుపోయారు. తణుకు రూరల్ పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. క్లూస్ టీం సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. చోరీ జరిగిన ఇంట్లో, ఆరుబయట సీసీ కెమెరాలు ఉనప్పటికీ దుండగులు వాటిని ధ్వంసం చేసి డిడిఆర్ వారితో పట్టుకుపోయినట్లు బాధితులు చెబుతున్నారు. బాధితుడు చొప్ప కృష్ణకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ కె.చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల: 83339 88814

టూరిస్టుల రక్షణలో కేంద్రం విఫలం

సిపిఎం ఆధ్వర్యాన కొనసాగిన నిరసనలు

ఆచంటలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు కేతా గోపాలన్

ఆచంట : టూరిస్టులకు రక్షణ కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ అన్నారు. శనివారం ఆచంట సంత మార్కెట్లో ఉగ్రవాదం నశించాలి, మతసామరస్యాన్ని కాపాడుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ టెర్రరిస్టుల కాల్పుల్లో 26 మంది ప్రాణాలు పోగొట్టుకున్నారని, అమాయకమైన ప్రజలను ఇలా ఉగ్రవాదులు హతమార్చడం హేయమైన చర్య అని అన్నారు. కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా ఈ చర్యను ప్రతి ఒక్కరూ ఖండించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఉగ్రవాద వ్యతిరేక ఉద్యమం నిర్మించాలని, దీనికి మతం రంగు పులమకూడదన్నారు. జమ్మూ కాశ్మీర్‌ను కాపాడుకోవాలని, అక్కడ శాంతియుత వాతావరణం నెలకొల్పాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పి.మోహన్ రావు, కమిటీ సభ్యులు తలుపురి బుల్లబ్బాయి, ఎస్‌విఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, బండి రంగారావు, తోటపల్లి సత్యనారాయణ, నెక్కంటి కృష్ణమూర్తి, చదలవాడ చంటిబాబు, రొక్కాల దేవదానం, సిర్రా విగ్నేశ్వరుడు, షేక్ మస్తాన్ పాల్గొన్నారు. **తణుకు :** ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో సిఐటియు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన, ధర్నా నిర్వహించి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో చనిపోయిన వారికి జోహార్లు అర్పించి మత సామరస్యం వర్ధిల్లాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడారు. ఈ దాడులకు కేంద్ర ప్రభుత్వమే ప్రధాన కారణమని విమర్శించారు. అనంతరం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, కామన మునిస్వామి, రమేష్, నూకరాజు, వల్లూరి వెంకటేశ్వరరావు, అభిషేక్, నాగరత్నం, కనకరాజు, ఎన్.ఆదినారాయణబాబు, బ్రహ్మజీ, శివకుమార్, హర్షిత, టివిఎస్.మూర్తి పాల్గొన్నారు. **భీమవరం :** భీమవరం పిడిఎఫ్ ఎంఎల్‌సి కార్యాలయంలో పహల్గాంలో పర్యాటకులపై లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ దాడిచేసి అమానవీయంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ పిడిఎఫ్ ఎంఎల్ సి బొర్రా గోపీమూర్తి కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు.

నక్కల కాలువపై భారీగా మట్టి దోపిడీ

చోద్యం చూస్తున్న అధికారులు

ఆచంట : మట్టి మాఫియా ఆగడాలు రోజురోజుకు హెచ్చు మీరుతున్నాయి. మట్టి తరలింపు ఆక్రమణలు పెద్ద ఎత్తున జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం నియోజకవర్గంలోని ఆచంట శివారు నక్కల కాలువ, గుమ్మలూరు రాయగొప్ప, నక్కల కాలువలో మట్టి తవ్విన ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటించారు. ఈ సందర్భంగా వీరు ఆసక్తికరమైన విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నక్కల కాలువలో అనుమతి లేకుండా పర్మిషన్ ఇచ్చిన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, కుంగిపోయిన నక్కల కాలువ గట్టును పటిష్ట పరచాలని, మట్టి తవ్వకాలపై పర్మిషన్ ఇచ్చిన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం గోపాలన్ మాట్లాడుతూ మట్టి తరలింపు ఆక్రమణలు పెద్ద ఎత్తున జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దీని వెనుక ఆంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మౌన వ్రతం వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఆక్రమణల వెనుక మామూళ్లు కదే ఉందని ఆరోపించారు. ప్రభుత్వ స్థలాల్లో బోదె, కాలువ గట్ల మట్టిని తీసుకుపోతున్నా కనీసం ఆ వైపు కన్నెత్తి చూడడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ స్థలాలను కొందరు పెద్ద ఎత్తున ఆక్రమణలకు పాల్పడి మట్టిపూడుకలు చేస్తున్నారన్నారు. ఆచంట నియోజకవర్గం పరిధిలో నక్కల కాలువను జిల్లా మంత్రి అండదండలతో, ఏటిగట్ల పూడిక పనులతో, నక్కల కాలువను సుమారు 5 ఎకరాల వరకు సుమారు 15 అడుగుల మేర లోతుగా తవ్వేయడంతో చుట్టుపక్కల ఉన్న ఆక్వా చెరువుల రైతాంగంతోపాటు పశువులు కూడా ఆ ప్రాంతాల్లో దిగితే కనీసం జాడ కూడా కనిపించని పరిస్థితి నెలకొంటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో పంట పొలాలకు ముంపు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం నేతలు పిల్లి ప్రసాద్, మూడే మోజెస్, పి.మోహన్ రావు, ఎస్‌విఎన్.శర్మ, తలుపురి బుల్లబ్బాయి, సిర్రా నరసింహమూర్తి, కొండేటి సత్యనారాయణ, తోటపల్లి సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ప్రోత్సాహకం

తాడేపల్లిగూడెం : అలంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆకిరి ఝాన్సీ 587 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల నుంచి తాడేపల్లిగూడెం డివిజన్లో ప్రథమురాలుగా, జిల్లాస్థాయిలో నాలుగో స్థానం సాధించినందుకు శనివారం స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఏ బొలిశెట్టి శ్రీనివాస్ సత్కరించి రూ.5 వేల నగదు ప్రోత్సాహకం అందించారు. ఆకిరి ఝాన్సీ తల్లిదండ్రులు శ్రీహరి, దేవి వ్యవసాయ కూలీలు. మంద హేమ 582 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో రెండవ స్థానంలోను, మంగ లాహిరి రత్నశ్రీ 548 మార్కులు సాధించి మూడో స్థానంలో నిలిచింది. వీరితో పాటు వీరి తల్లిదండ్రులను కూడా ఎంఎల్ఏ సన్మానించారు. విద్యార్థులను ఉద్దేశించి ఎంఎల్ఏ మాట్లాడుతూ భవిష్యత్తులో ఉన్నతమైన స్థానాన్ని చేరుకోవడానికి కృషిచేయాలని, నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల హెచ్ఎం తాడేపల్లి శారద, రాయపురెడ్డి మారుతి, కొమ్మూరి అశోక్, పారిచర్ల ప్రసాద్, జెట్టి అశోక్, నరేంద్ర మాస్టారు, జనసేన నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణితంతో మేధస్సుకు పదును

శ్రీనివాస రామానుజన్ అవార్డు గ్రహీత రేపాక వెంకన్న బాబు

భీమవరం టౌన్ : గణితశాస్త్రంతోనే మేధస్సుకు పదును అని, కష్టతరంగా ఉన్న అర్థం చేసుకుంటే చాలా సులభంగా సాగుతుందని రాష్ట్ర ప్రభుత్వ శ్రీనివాస రామానుజన్ అవార్డు గ్రహీత రేపాక వెంకన్న బాబు అన్నారు. శనివారం భీమవరం సర్ సివి.రామన్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 85వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంకన్న బాబు మాట్లాడుతూ ప్రపంచ గణిత శాస్త్రవేత్తలకు దీటుగా మన భారతదేశ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ నిలిచారని అన్నారు. ప్రతి రంగానికి, ప్రతి అంశానికి గణితం ఎంతో అవసరమన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ గణితం పట్ల విద్యార్థులు ఆసక్తి చూపితే జీవితం కూడా ఒక లెక్క ప్రకారం క్రమశిక్షణతో నడుస్తుందని అన్నారు. అనంతరం వెంకన్న బాబును సత్కరించారు. కార్యక్రమంలో కె.పార్వతి, శైలజ, దుర్గాదేవి, సూర్జహాన్, ప్రమీల పాల్గొన్నారు.

దీపక్, క్రిస్సీకి గిన్నిస్ బుక్‌లో స్థానం

తణుకు : తణుకు పట్టణానికి చెందిన బద్దా దీపక్, బద్దా క్రిస్సీ ఏంజెలినాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారు. విజయవాడలోని హలెన్ మ్యూజిక్ స్కూల్ ద్వారా ఆన్‌లైన్ ద్వారా 2024 డిసెంబర్ 1వ తేదీన 18 దేశాల్లో 1046 మందికి కీబోర్డులో స్వరాలను ప్లే చేయడం ద్వారా ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. ఈనెల 25వ తేదీన విజయవాడలోని మెట్రో పాలిటిన్ మిషన్ చర్చిలో మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు అగస్టీన్ చేతుల మీదుగా సర్టిఫికెట్స్, మెడల్స్‌ను అందుకున్నారు. పాతవూరు, ఇరగవరం రోడ్డు, తణుకుకు చెందిన దీపక్‌కుమార్, క్రిస్సీ ఏంజెలినా ఇద్దరూ అన్నాచెల్లెలు. వీరిద్దరూ ఉండ్రాజవరం రోడ్డులో ఉన్న ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో 8, 7వ తరగతులు చదువుతున్నారు. ఈ సందర్భంగా పలువురు వీరికి అభినందనలు తెలియజేశారు.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

కాళ్ల : కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ గీతాభాయి శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ నిల్వలు, పలు రికార్డులను ఆమె తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిధిలో గర్భిణుల వివరాల నమోదు, ఒపి తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసిబ్బంది దీర్ఘకాలిక పేషంట్లకు పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేయాలని, సిబ్బంది తీసుకోవాల్సిన పలు విషయాలపై సూచనలు, సలహాలు చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుల సమాచారం సేకరించాలి : జెసి

భీమవరం : ప్రధానమంత్రి ఉజ్వల యోజన ఎల్‌పిజి గ్యాస్ కనెక్షన్స్ పొంది వినియోగించని లబ్ధిదారుల సమాచారాన్ని సేకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జెసి, జిల్లా పౌర సరఫరాల అధికారి, బిపిసిఎల్, హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్ గ్యాస్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం గ్యాస్ కనెక్షన్‌లపై సమీక్షించారు. జిల్లాలో ఉజ్వల 2.0 పథకం కింద గ్యాస్ కనెక్షన్ పొంది నాటి నుంచి రెండేళ్ల రీఫిల్ తీసుకోని లబ్ధిదారుల జాబితాను గ్రామాల వారీగా సిద్ధం చేయాలన్నారు. ఇప్పటికే గుర్తించిన గ్యాస్ తీసుకున్న 100 మంది లబ్ధిదారులు ఉన్నారా, లేరా సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ, హెచ్‌పిసిఎల్ సీనియర్ మేనేజర్ టిసి వెంకటేశ్వర్లు, ఐఒసిఎల్ మేనేజర్ ఎంవి.రామప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ఇండియన్ డిజిటల్ స్కూల్ యాజమాన్యం

మెరిట్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఉండి : గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే తమ లక్ష్యమని ఇండియన్ డిజిటల్ స్కూల్ కరస్పాండెంట్ కలిశెట్టి విజయ్‌కృష్ణ అన్నారు. శనివారం ఇండియన్ డిజిటల్ స్కూల్ ప్రాంగణంలో ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల ప్రథమ స్థానం సాధించిన కలిశెట్టి డాని సత్యకృష్ణ ప్రభాస్(590), స్కూల్ ద్వితీయ స్థానం సాధించిన బొండాడ హరిప్రియ(580), 500 మార్కులు పైబడి వచ్చిన 23 మంది విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు చిరు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విజయ్‌కృష్ణ, ప్రిన్సిపల్ రజనీకుమార్ మాట్లాడుతూ వరుసగా రెండోసారి పదోతరగతిలో మండల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం తమకు గర్వకారణమని, ఈ విజయం తమ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులదేనని వారు తెలిపారు. ప్రతి విద్యార్థికి చదువులో స్వార్థంతో కూడిన పోటీతత్వం ఉండాలని వారు సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకుని తమ స్కూల్ పేరును నిలబెట్టాలని వారు విద్యార్థులను కోరారు. ఎవరైనా మెరిట్ విద్యార్థులువుండి ఫీజులు కట్టుకుని చదువుకోలేని పరిస్థితుల్లో ఉన్న విద్యార్థులకు తమ వంతు సహకారంగా ఫీజు రాయితీ ఇచ్చి వారి ఉన్నత విద్యకు తోడ్పాటును ఇస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ డిజిటల్ స్కూల్ వైస్ ప్రిన్సిపల్ సుబ్బారావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గెద్ద ఆదినారాయణ, ఆఫీస్ ఇన్‌చార్జి కనకలక్ష్మి, స్కూల్ ఇన్‌చార్జి బాలాసాయి నాగశ్రీ, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అధ్యాపకులు అభినందనీయులు

కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు


హెచ్ఎంను సత్కరిస్తున్న మురళీకృష్ణంరాజు

భీమవరం టౌన్ : తమ కళాశాల దత్తత పాఠశాల అయిన చిన అమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.అనురాధ, అధ్యాపకులను ప్రత్యేకంగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో చిన అమిరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.అనురాధ మాట్లాడుతూ తమ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. పదో తరగతి పరీక్షల్లో తమ పాఠశాల నుంచి 120 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 98 మంది ఉత్తీర్ణులై 82 శాతం ఫలితాలు సాధించారన్నారు. తమ విద్యార్థులు 14 మందికి పైగా 500 మార్కులు సాధించడంతోపాటు, ఎఎస్ఎస్ విఆర్.కార్తీక్ 589 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానం, జిల్లాలోనే మూడవ స్థానం సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. జిల్లా అధికారులతో ప్రశంసలు పొందాడన్నారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించటంలో విశేష కృషిచేసిన అధ్యాపకులు చింతపల్లి ప్రసాదరావు, పి.అప్పన్న, పి.రవిరాజును ఆయన అభినందించారు.

కూలీల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఎం జి